కంటి వైద్య శిబిరానికి స్పందన

బోథ్, సెప్టెంబర్ 25 : బోథ్‌లోని మార్కండేయ ఆలయ సమీపంలో మాసం లక్ష్మి వెల్ఫేర్ సొసైటీ, ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ మాసం అనిల్ కుమార్ మాట్లాడుతూ 300 మంది శిబిరానికి వచ్చి కంటి పరీక్షలు చేయించుకున్నారన్నారు. 50 మందికి ఆపరేషన్, అవసరమున్న వారికి కంటి అద్దాలు త్వరలో అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య సంస్థ విజన్ సెంటర్ కోఆర్డినేటర్ వెంకటరమణ, టెక్నీషియన్ ఆత్రం గజానంద్, కృష్ణ, అమిత్, సభ్యులు ఆనంద్, జాదవ్ కృష్ణ, నవీన్, ఓస సాయికుమార్, మాసం అరవింద్, రాకేశ్, శ్రీధర్ పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

ఇచ్చోడ, సెప్టెంబర్ 25 : వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. బుధవారం జామిడి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే ఇచ్చోడలోని ఆశ్రమోన్నత పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు వడ్డించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

గుడిహత్నూర్, సెప్టెంబర్ 25 : గుడిహత్నూర్‌లోని ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న కామర్స్ అధ్యాపకుడి పోస్టు భర్తీకి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆరె శ్రీనివాస్ తెలిపారు. ఇంగ్లిష్ మీడియంలో బోధించేందుకు అనుభవజ్ఞులైన ఎం.కాం, బీఈడీ అర్హత కలిగిన వారు ఈ నెల 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

పారిశుధ్యం, మొక్కల సంరక్షణపై దృష్టి సారించాలి

నార్నూర్, సెప్టెంబర్ 25 : పారిశుధ్యం, మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో జవహర్‌లాల్ సిబ్బందికి సూచించారు. బుధవారం నార్నూర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిధిలో నిత్యం పారిశుధ్య నిర్వహణ చేపట్టాలన్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వీధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే వందశాతం పన్నుల వసూలు చేయాలన్నారు. సమావేశంలో ఈజీఎస్ ఏపీవో జాదవ్ సురేశ్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే

కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ఇచ్చోడ, సెప్టెంబర్ 25: ఇచ్చోడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్ డే ఉత్సాహంగా నిర్వహించారు. డిగ్రీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొదటి సంవత్సరం విద్యార్థులను కళాశాలలోకి ఆహ్వానించారు. విద్యార్థులు పాటలపై చేసిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమ నిర్వహణకు న్యాయవాది ఎట్టం రాములు రూ.5 వేలు విరాళం అందజేశారు. ఎట్టం రాములకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మణ్, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భీంపూర్ ఎంఈవోగా శ్యాంసుందర్

భీంపూర్ , సెప్టెంబర్ 25 : భీంపూర్ ఎంఈవోగా శ్యాంసుందర్‌ను నియమిస్తున్నట్లు విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పిప్పల్‌కోటి ఉన్నత పాఠశాల స్కూల్‌కాంప్లెక్స్ హెచ్‌ఎంగా ఉన్న శ్యాంసుందర్ మండల విద్యాశాఖాధికారిగా వ్యవహరిస్తారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

ఎదులాపురం, సెప్టెంబర్ 25 : ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా జిల్లాలో నిర్వహించనున్న పదో తరగతి, ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని డీఈవో ప్రణీత ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 3 నుంచి 9 వరకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు అలాగే మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 నిమిషాల వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పరీక్షల కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు.

ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఎదులాపురం, సెప్టెంబర్ 25 : బంగారిగూడలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో బదిలీల సందర్భంగా ఏర్పడిన ఉపాధ్యాయ (పీజీటీ) ఖాళీలను బోధన ప్రతిపాదికన నియమించుటకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శివాజీ తెలిపారు. తమ పాఠశాలలో కామర్స్ బోధించేందుకు ఎంకామ్, బీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈనెల 28వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఎదులాపురం, సెప్టెంబర్ 25 : ఆదిలాబాద్‌లోని ఓల్డ్ హౌసింగ్ బోర్డుకు చెందిన కోపరేటివ్ బ్యాంకు రిజిస్ట్రర్‌గా పని చేస్తున్న కోనేటి ముత్యంరెడ్డి ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను బుధవారం మాజీమంత్రి జోగు రామన్న పరామర్శించారు. ఆయన వెంట దామోదర్ రెడ్డి, కౌన్సిలర్ అశోక్ ఉన్నారు.

జైనథ్, సెప్టెంబర్ 25: బాలాపూర్ గ్రామానికి చెందిన ఈరవేణి రవీందర్ ఇటీవల పాము కాటుకు గురై మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను సామాజిక కార్యకర్త మౌనిశ్ రెడ్డి పరామర్శించి ఆర్థిక సాయంఅందజేశారు. ఆయన వెంట ప్రశాంత్ కడిసే, జక్కుల కిషన్, సాగర్ రెడ్డి, దినేశ్ రెడ్డి ఉన్నారు.

ఘనంగా ఫార్మాసిస్టు డే వేడుకలు



నిర్మల్ దవాఖానలో కేకు కట్ చేస్తున్న ఫార్మాసిస్టులు

నిర్మల్ చైన్‌గేట్, సెప్టెంబర్ 25 : ప్రపంచ ఫార్మాసిస్టుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్మల్ వైద్య కళాశాల దవాఖానలో బుధవారం వేడుకలు నిర్వహించారు. ఫార్మాసిస్టులు కేకు కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఫార్మసీ ఇన్‌ఛార్జి మోహన్‌రెడ్డి, సతీవ్, శ్రీనివాస్, సమ్మయ్య, రజాక్, మమత, వేణుగోపాల్ పాల్గొన్నారు.

పాతబావి పూడిక పనుల పరిశీలన

నేరడిగొండ, సెప్టెంబర్ 25 : మండల కేంద్రంలోని పాతబావి పూడ్చివేసే పనులను బుధవారం జిల్లా పరిషత్ సీఈవో జితేందర్‌రెడ్డి పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం నేరడిగొండ, వడూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐమాస్ లైట్లను పరిశీలించారు. అలాగే మరికొన్ని ఏర్పాటు చేయనున్న స్థలాలను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో రజ్వీర్, పంచాయతీ కార్యదర్శి నర్సారెడ్డి ఉన్నారు.

సోమవారం బీర్నంది నర్సరీలో నాటకుండా వదిలేసిన మొక్కలు

బుధవారం నర్సరీలో కనబడకుండా మాయమైన మొక్కలు

మొన్న ఫుల్.. నేడు నిల్

రెండు రోజుల్లోనే నర్సరీలో మొక్కలు మాయం

ఖానాపూర్ రూరల్, సెప్టెంబర్ 25: నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం బీర్నంది గ్రామంలోని నర్సరీలో రెండు రోజుల క్రితం నిండుగా ఉన్న మొక్కలు నేడు నిల్‌గా దర్శనమిస్తున్నది. తొమ్మిది నెలల పాటు పెంచిన మొక్కలను నాటకుండా రెండు రోజుల్లోనే కనబడకుండా చేశారు. వనమహోత్సవంలో భాగంగా గ్రామంలోని నర్సరీలో 13 వేల మొక్కలు పెంచారు. రెండు రోజుల క్రితం నర్సరీలో 10 వేల మొక్కలకు పైగా నాటకుండానే వదిలేసిన చిత్రాన్ని 'నమస్తే తెలంగాణ' క్లిక్ మనిపించింది. అదే నర్సరీని బుధవారం చూడగా ఒక మొక్క కూడా లేకుండా ఖాళీ చేసి చదునుగా ఉంచారు. ఫీల్డ్ అసిస్టెంట్ నేరుగా ట్రాక్టర్‌లో తీసుకెళ్లి ఓ రహస్య ప్రదేశంలో పడేసినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మొక్కలు నాటకపోయేసారికి అధికారులు చర్యలు తీసుకుంటారని ముందస్తు నేపంతో మొక్కలను మాయం చేసి ఉంచారు. మొక్కల సంరక్షణకు ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించిన ఫలితం లేకుండా పోయింది.

మురుగు నీరు పంటకు అపార నష్టం

జైనథ్, సెప్టెంబర్ 25: జైనథ్ మండలం గూడ గ్రామంలో మురుగు కాల్వలు లేక వర్షపు నీరు నిల్వ ఉండడంతో ఈగలు, దోమలు వృద్ధి చెంది ప్రజలు జ్వరాల బారిన పడే ప్రమాదం ఉంది. దీనికి తోడు గ్రామానికి అనుకొని ఉన్న జక్కుల కిషన్ పంట పొలంలోకి వరద, మురుగు నీరు చేరడంతో రెండెకరాల మొక్క జొన్న పంట పూర్తిగా దెబ్బతింది. సంబంధిత అధికారులు విన్నవించిన ప్రయోజనం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

మొక్కజొన్న పంటలో నిలిచిపోయిన మురుగు నీరు

108, 102 వాహనాల తనిఖీ

వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

బోథ్, సెప్టెంబర్ 25 : బోథ్, నేరడిగొండ, బజార్‌హత్నూర్ మండలాలకు సంబంధించిన 108, 102, 1962 వాహనాలను బోథ్‌లో బుధవారం క్వాలిటీ ఆడిటింగ్ డిపార్ట్‌మెంట్ అధికారి కిశోర్, ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్ తనిఖీ చేశారు. వాహనాలకు సంబంధించిన రికార్డులు, అంబులెన్స్‌లో ఉన్న పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్ మాట్లాడుతూ వాహనాల పని తీరు బాగుందన్నారు. ఉద్యోగులు సమయ పాలన కచ్చితంగా పాటించాలని సూచించారు. 108కు సంబంధించి జిల్లా ఉత్తమ పైలెట్లుగా స్వామి, మహేశ్‌కుమార్, 102కు ప్రాజెక్టు నుంచి జిల్లా ఉత్తమ పైలెట్లుగా అర్స స్వామి, కే మహేశ్‌కుమార్ అవార్డు ప్రోగ్రాం మేనేజర్ చేతుల మీదుగా అందుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ రాజశేఖర్, డాక్టర్ అవినాశ్, ప్యారవెట్ రోజారాణి, ఫారూఖ్, పైలెట్లు సంతోష్, ప్రశాంత్, ఈఎంటీలు రమేశ్, సంతోష్, క్యాప్టెన్లు బీ నవీన్ కుమార్, పీ బాబు పాల్గొన్నారు.

సబ్సిడీ సిలిండర్ పత్రాలు అందజేత

ఖానాపూర్, సెప్టెంబర్ 25 : ఖానాపూర్‌లోని ఒకటి, పదో వార్డుల్లో అర్హులైన మహిళలకు మహాలక్ష్మీ పథకం కింద మంజూరైన వంట గ్యాస్ సిలిండర్ల సబ్సిడీ పత్రాలను బుధవారం వార్డుల కౌన్సిలర్లతో కలిసి మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సంతోష్, కౌన్సిలర్ శ్రీనివాస్, మహిళలు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం : కాపర్ తీగలు చోరీ

బాసర, సెప్టెంబరు 25 : బిద్రెల్లి గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రంలో ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి అందులోని కాపర్ తీగలను దుండగులు చోరీ చేశారు. బుధవారం స్థానికుల వివరాల ప్రకారం.. రైతు గంగాధర్ వ్యవసాయ క్షేత్రంలోని ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని కాపర్ తీగలను దుండగులు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. విద్యుత్ అధికారులకు సమాచారం అందించామని పేర్కొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

పంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో ఫణిందర్‌రావ్

నేరడిగొండ, సెప్టెంబర్ 25 : గ్రామాల్లో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డీఎల్‌పీవో ఫణిందర్ రావ్ సూచించారు. బుధవారం తేజాపూర్ గ్రామంలో ఆయన పర్యటించారు. గ్రామంలోని పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగు నీరు నిలువ ఉండకుండా చూడాలన్నారు. ముఖ్యంగా దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు.డ్రమ్ముల్లో నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. వైద్య చికిత్స విషయాలను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో పలువురితో మాట్లాడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీవో లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్ రెడ్డి, వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

విద్యాశాఖ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించాలి

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 25 :నిర్మల్ జిల్లాలో మండల విద్యాధికారులుగా బాధ్యతలు స్వీకరించిన ప్రధానోపాధ్యాయులకు డీఈవో కార్యాలయంలో పరిచయ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రతి కార్యక్రమాన్ని ఆయా మండలాల్లో విజయవంతంగా నిర్వహించాలన్నారు. పాఠశాలలను క్రమం తప్పకుండా తనిఖీ చేసి ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను పర్యవేక్షించాలన్నారు.

ఏకరూప దుస్తుల భత్యం విడుదల

సోన్, సెప్టెంబర్ 25 : నిర్మల్ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందజేసిన ఒక జత ఏకరూప దుస్తుల కుట్టు కూలీ భత్యం విడుదలైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్ రెడ్డి తెలిపారు. జిల్లాలో 742 ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు రూ.50 చొప్పున రూ. 23,84,250 కూలీ భత్యం విడుదలైందని ఆయా పాఠశాలల ఖాతాల్లో వీటిని జమ చేశామని పేర్కొన్నారు.

ఎంఈవోల బాధ్యతలు స్వీకరణ

సోన్, సెప్టెంబర్ 25: సోన్ మండల విద్యాశాఖాధికారిగా తొడిశెట్టి పరమేశ్వర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జాఫ్రాపూర్ గ్రామ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న పరమేశ్వర్ మండల విద్యాశాఖాధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయనను మండలంలోని ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

నిర్మల్ మండల విద్యాశాఖాధికారిగా పీ వెంకటేశ్వర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. చిట్యాల్ గ్రామంలోని ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయా గ్రామాల పాఠశాలల ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

నార్నూర్, సెప్టెంబర్ 25 : నార్నూర్‌లోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈవోగా విధులు నిర్వహించిన రాపెల్లి ఆశన్న ఉట్నూర్‌కు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో పవార్ అనిత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నూతన ఎంఈవోను ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ కార్యాలయ సిబ్బంది శాలువాతో సన్మానించారు.

కళాశాలలో పిచ్చిమొక్కలు తొలగింపు

ఎదులాపురం,సెప్టెంబర్ 25 : చెత్తను రోడ్లు, మురుగు కాలువల్లో వేయకుండా మున్సిపల్ ఆటోలో వేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేందర్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా బుధవారం ఆదిలాబాద్‌లోని డిగ్రీ సైన్సెస్ లో స్వచ్ఛందంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ఆవరణలోని పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు పట్టణాన్ని స్వచ్ఛతగా ఉంచేల సహకారం అందించాలన్నారు. తడి, పొడి చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా మున్సిపల్ వాహనాల్లో వేయాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జైనథ్, సెప్టెంబర్ 25 : సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్యాంసుందర్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో మండల ప్రత్యేకాధికారి సాంబశివరావ్, ఎంపీవో వెంకట్ రాజు, మండల వైద్యురాలు నయనత, అధికారులు పాల్గొన్నారు.

హేటిని గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలి

బేల, సెప్టెంబర్ 25 : మండలంలోని హేటి, తాలయిగూడ, విష్ణుగూడ గ్రామాలు కలిపి ఒక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని ఆ గ్రామస్తుల బుధవారం బేలలో తహసీల్దార్ రఘునాథ్ రావ్, ఎంపీడీవో మహేందర్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ బాది గ్రామ పంచాయతీకి వెళ్లాలంటే సరైన రవాణా సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, పక్కనే ఉన్న హేటి గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేస్తే తమ సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. ఎన్నికల ముందు గ్రామ పంచాయతీగా ప్రకటించాలని గ్రామస్తులు కోరారు. ఇక్కడ మాజీ ఎంపీటీసీ బండి సుజాత, సుదర్శన్, గణేశ్, రాంకిషన్, రాందాస్, విష్ణు ఉన్నారు.

విద్యార్థుల క్షేత్ర స్థాయి పర్యటన

కుంటాల, సెప్టెంబర్ 25 : పాఠ్యాంశం 'పబ్లిక్ ఇనిస్టిట్యూషన్స్' ప్రాజెక్ట్ వర్క్‌లో భాగంగా బుధవారం సృజన విద్యానిలయంలో చదువుతున్న 4వ తరగతి విద్యార్థులు మండల కేంద్రంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలను క్షేత్ర స్థాయిలో సందర్శించారు. తహసీల్ కార్యాలయం, పోలీస్ స్టేషన్, మండల పరిషత్ కార్యాలయాల్లో అధికారాలు, విధులను గురించి అధికారులను అడిగి విద్యార్థులు తెలుసుకున్నారు. వారి వెంట పాఠశాల ప్రిన్సిపాల్ గంగన్న, ఉపాధ్యాయులు కృష్ణ, చరణ్ ఉన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

ఇంద్రవెల్లి, సెప్టెంబర్ 25 : ఆర్టీసీ సంస్థ ద్వారా కల్పిస్తున్న సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో ఆదిలాబాద్ జిల్లా ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ప్రయాణికులతో పాటు మండల ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ కల్పన మాట్లాడుతూ ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన ఆర్టీసీ లింగ్ ట్రీ క్యూఆర్ కోడ్ స్కానింగ్‌ను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గమ్యం యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది విలేజ్ బస్ ఆఫీసర్ సతీశ్, ఇంద్రవెల్లి కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ముకాడే ఉత్తమ్, పట్టణ అధ్యక్షుడు ఎండీ జహీర్, ప్రయాణికులు పాల్గొన్నారు.

ఎంఈవోను నియమించడం సంతోషకరం

దస్తురాబాద్, సెప్టెంబర్ 25 : మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న టీ గంగాధర్ మండల ఇన్‌చార్జి విద్యాధికారిగా నియమితులయ్యారు. బుధవారం జడ్పీ ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు, హెచ్‌ఎం కోట వేణు ,ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం కోట వేణు మాట్లాడుతూ మండల ఎంఈవోగా టీ గంగాధర్‌ను నియమించడం సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట నర్సింహారావు, కోటేశ్, కొమురయ్య, ప్రవీణ్, భూమన్న, శోభన్, సీఆర్పీ తిరుపతి, ఐఆర్పీలు జగన్, ఉదయ్ పాల్గొన్నారు.

మతి స్థిమితం లేని వృద్ధురాలు మృతి

ఉట్నూర్ రూరల్, సెప్టెంబర్ 25 : ఉట్నూర్ మండలం శంకర్‌నాయక్ తండా గ్రామానికి చెందిన మతి స్థిమితం లేని వృద్ధురాలు సమీప వాగులో ప్రమాదవశాత్తు పడి మృతి చెందింది. ఎస్ఐ మనోహర్, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌నాయక్‌తండా గ్రామానికి చెందిన లచ్చిబాయి(65) బుధవారం సమీప వాగులో శవమై తేలగా గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామస్తుల సహాయంతో మృతదేహాన్ని వాగు నుంచి బయటకు తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

భైంసా, సెప్టెంబర్ 25 : భైంసాలోని బైల్‌బజార్ ప్రాంతంలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. బాధితుడి వివరాల ప్రకారం.. కుంట ఏరియాకు చెందిన మాదోల్ల గట్టు కుటుంబ సభ్యుల ఆరోగ్యం బాగా లేకపోవడంతో మంగళవారం ఇంటికి తాళం వేసి దవాఖానకు వెళ్లారు. బుధవారం ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి తాళం పగలగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా బీరువాలో నుంచి రూ. 30వేల నగదు, బంగారం ఉంగరం, కమ్మలు చోరీకి గురైనట్లు గుర్తించాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

ఉరి వేసుకుని ఒకరి ఆత్మహత్య

తానూర్, సెప్టెంబర్ 25 : తానూర్ మండలం నందగావ్ గ్రామానికి చెందిన బొంతేవాడ్ నగేశ్ (49) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ రమేశ్ తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. గత కొన్ని సంవత్సరాల నుంచి నగేశ్ కడుపునొప్పితో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు దవాఖానకు వెళ్లి చికిత్స చేయిస్తామని చెప్పిన వినకపోవడం, మద్యానికి బానిసై బుధవారం ఉదయం ఇంటి సమీపంలో గల తన సొంత చేనుకు కాలకృత్యాలకు వెళ్లిన నగేశ్ జీవితంపై విరక్తి చెంది వేప చెట్టుకు ఉరి వేసుకున్నాడు. చిన్న కుమారుడు విఠల్ నాన్న ఇంక రాలేదని చేనుకు వెళ్లి గమనించగా ఉరివేసుకున్న తండ్రిని చెట్టు నుంచి కిందికి దించి చూడగా కొన ఊపిరితో ఉండగా భైంసా ప్రభుత్వ దవాఖానకు తరలించగా గమనించిన డాక్టర్లు మృతి చెందినట్లు నిర్ధారించారు. భార్య సంగీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వరి పంట పరిశీలన

భైంసాటౌన్, సెప్టెంబర్ 25 : తిమ్మాపూర్ గ్రామంలో రైతులు సాగు చేస్తున్న వరి పంటను బుధవారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజిప్రసాద్, ముథోల్ ఏరువాక శాస్త్రవేత్తలు నర్సయ్య, కార్తిక్ పరిశీలించారు. వరిలో ఎండు ఆకు తెగులు నివారణకు ప్లాంటామైసిన్, కాపర్ ఆక్సిక్లోరైట్ మందులను పిచికారీ చేయాలని సూచించారు.

తహసీల్దార్లకు సన్మానం

ఇచ్చోడ, సెప్టెంబర్ 25 : ఇచ్చోడ మండల తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సత్యనారాయణరావ్‌ను బుధవారం బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, నాయకులు పాండు, గణేశ్, సంజీవ్ పాల్గొన్నారు.

బేల, సెప్టెంబర్ 25: బేల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన రఘునాథ్‌రావ్‌ను బుధవారం బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గంభీర్ ఠాక్రే, జక్కుల మధుకర్, ప్రమోద్ రెడ్డి, విపిన్, మంగేశ్ ఠాక్రే, కిషన్ వైద్య పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీ కేసులో నలుగురికి ఆరు నెలల జైలు

ఎదులాపురం, సెప్టెంబర్ 25: ఎస్సీ, ఎస్టీ కేసులో ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.4 వేల జరిమానా విధిస్తూ ప్రత్యేక న్యాయమూర్తి డాక్టర్ పీ శివరాంప్రసాద్ తీర్పును వెలువరించినట్లు మంచిర్యాల కోర్టు లైజన్ అధికారి సయ్యద్ తాజొద్దీన్ తెలిపారు. కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జిల్లా జన్నారం పోలీస్ స్టేషన్ పరిధిలో 16 మే 2020న తమ బంధువును తీసుకెళ్లాడని కోపంతో ఎస్సీ మాల కులానికి చెందిన బాట్ల అన్వేశ్(17) యువకుడిని నేరస్తులు గారిపెల్లి హరీశ్ కుమార్ గౌడ్, ముత్యం సాయి, పట్కూట్ ప్రశాంత్, మహ్మద్ అజ్మత్ ఖాన్ దాడి చేసి గాయపరిచారు. కులం పేరుతో దూషించి చంపుతానని బెదిరించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి జన్నారం ఎస్ఐ ఎం వినోద్‌కుమార్ కేసు నమోదు చేశారు. మంచిర్యాల సబ్ డివిజన్ ఇన్‌చార్జి జైపూర్, ఏసీపీ జీ నరేందర్ దర్యాప్తు చేసి పై నలుగురిపై వివిధ సెక్షన్ల కింద కోర్టులో దాఖలు చేశారు. సీడీవో ఇఫ్తేకార్ అహ్మద్, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముస్కు రమణారెడ్డి 17 మంది సాక్షులను విచారించి నేరం రుజువు చేయగా నలుగురికి ఆరు నెలల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.4 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. నిందితులకు శిక్ష విధించడంలో కృషి చేసిన జన్నారం ఎస్ఐ జీ రాజవర్ధన్, సీఐ లక్షెట్టిపేట నరేందర్‌ను కోర్టు విధుల అధికారులను రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ ఐపీఎస్ ఐజీ, మంచిర్యాల డీసీపీ భాస్కర్ ఐపీఎస్, మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్ అభినందించారు.

తిర్పెల్లి కాలనీలోని ఇంట్లో చోరీ

ఎదులాపురం, సెప్టెంబర్ 25: ఆదిలాబాద్‌లోని తిర్పెల్లి కాలనీలోని నీరటివాడలోని ఓ ఇంట్లో దొంగతనం జరిగింది. టూ టౌన్ సీఐ కరుణాకర్ రావ్ వివరాల ప్రకారం.. ఇంటి యజమాని శ్యాం, కుటుంబ సభ్యులు మంగళవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో దొంగలు చొరబడ్డారు. బీరువాలోని రూ. లక్షా నగదుతో పాటు రెండు తులాల బంగారం ఎత్తుకెళ్లారు. ఉదయం చూసేసరికి చోరీ జరిగినట్లు వారు గమనించారు. ఈ విషయమై టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వట్టివేర్లు గడ్డిని నాటిన అధికారులు

కడెం, సెప్టెంబర్ 25 : కడెం మండలం మద్దిపడగ గ్రామంలో బుధవారం ఈజీఎస్ ఆధ్వర్యంలో వట్టివేర్లు అనే గడ్డిని నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఆర్డీవో విజయలక్ష్మి హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుంచి తెచ్చిన ఈ వట్టివేర్లు అనే గడ్డిని గ్రామ సమీపంలోని నర్సరీ, ఇతర ప్రాంతాల్లో నాటినట్లు అధికారులు తెలిపారు. ఔషధ గుణాలు కలిగిన ఈ గడ్డి ద్వారా వివిధ రకాల మందులకు ఉపయోగపడుతుందని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. కార్యక్రమంలో ఏపీవో జయదేవ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు



జలపాతి సాయిలోహిత్‌ను సన్మానిస్తున్న మాజీ సైనికులు

ఎదులాపురం, సెప్టెంబర్ 25 : ఆదిలాబాద్‌లోని పిట్టలవాడకు చెందిన నాలుగు సంవత్సరాల తొమ్మిది నెలల సాయిలోహిత్ ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో బంగారు పతకం సాధించాడు. బాలుడి తండ్రి జలపతి రాజు మాజీ సైనికుడు (హవల్‌దార్). తల్లి జాహ్నవి గృహిణి. బాలుడు ప్రపంచంలోని జీ-20 దేశాల పేర్లు, 195 దేశాల పేర్లు, 40 అంతరిక్ష ఎలిమెంట్స్, ప్రపంచ దేశాల శాస్త్రవేత్తల నామకరణాలు, భారదేశంలోని భాషల పేర్లు, స్వతంత్ర్య సమరయోధుల పేర్లు, రాజధాని పేర్లు, సముద్రాల పేర్లను సులువుగా చెబుతాడు. కుమారుడి ప్రతిభను గుర్తించిన తల్లి ఆగస్టు 27వ తేదీన ఇండియా బుక్ ఆఫ్ రికార్డుకు దరఖాస్తు చేసింది. సెప్టెంబర్ 24వ తేదీన ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో బంగారు పతకం సాధించినట్లు సమాచారం అందింది. దీంతో బాలుడిని మాజీ సైనిక సంక్షేమ కార్యాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సైనికులు అశోక్, దేవన్న, తిరుపతిరెడ్డి, కిష్టయ్య, నజీర్ అహ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు సన్మానం

భైంసాటౌన్, సెప్టెంబర్ 25 : దేగాం గ్రామ శివారులో గల దత్తాత్రి ఆలయ పునర్నిర్మాణ పనులు రూ.10 లక్షలతో పూర్తయింది. ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డిని బుధవారం ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో దిగంబర్‌పటేల్, బాబారావ్‌పటేల్, బాపురావ్‌పటేల్ పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

ఇంద్రవెల్లి, సెప్టెంబర్ 25: ఇంద్రవెల్లి మండలం హర్కాపూర్ ఆంధ్‌గూడ గ్రామ పంచాయతీ పరిధిలోని కైలాస్‌నగర్ గ్రామానికి చెందిన ఓ మహిళ అదృశ్యమైనట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం...బ్లౌజ్ మెటీరియల్ కొనుగోలు చేయాలని భార్య భర్త సురేశ్‌తో చెప్పడంతో మంగళవారం ఉదయం మండల కేంద్రానికి తీసుకువచ్చాడు. భర్త సురేశ్‌ను ఒక దగ్గర కూర్చోబెట్టి బ్లౌజ్ మెటీరియల్ కొనుగోలు చేసి వస్తానని చెప్పి జనరల్ స్టోర్‌కు వెళ్లిన భార్య తిరిగి రాలేదు. అనుమానం వచ్చి భర్త అన్ని జనరల్ స్టోర్‌లతో పాటు తెలిసిన వారి దుకాణాల్లో వెతికిన భార్య ఆచూకీ లభించలేదు. భర్త సురేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు.

ఆదిలాబాద్‌లో అదృశ్యం.. నిర్మల్‌లో ప్రత్యక్షం

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 25: ఆదిలాబాద్‌లోని కాలర్ సన్ ఉర్దూ పాఠశాలలో చదువుకుంటున్న షేక్ ముదస్సీర్ అనే విద్యార్థి బుధవారం అదృశ్యమయ్యాడు. ఉదయం పాఠశాలకు వెళ్తున్నానని కుటుంబ సభ్యులకు చెప్పిన ముదస్సీర్ వాహనంలో నిర్మల్‌కు వచ్చాడు. తమ బంధువులకు కనబడగా వెంటనే తన తండ్రి ముజాహిద్‌కు సమాచారం అందించారు. దీంతో తల్లిదండ్రులు డయల్ 100కు సమాచారం అందించారు. పోలీసులు గాలించగా బస్టాండ్ ఎదురుగా కనబడ్డాడు. వారి కుటుంబీకులకు పోలీసులు అప్పగించారు.

మద్యం తాగి వాహనం నడిపిన తండ్రి కొడుకులకు జైలు

లక్ష్మణచాంద (మామడ), సెప్టెంబర్ 25: మద్యం తాగి ద్విచక్రవాహనం నడిపిన తండ్రి కొడుకులకు జైలు శిక్ష పడినట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. లక్ష్మణచాంద మండలం పీచర గ్రామానికి చెందిన పాతర్ల గంగన్న, పాతర్ల ప్రశాంత్ తండ్రి కొడుకులు. ఆగస్టు 25వ తేదీన మద్యం తాగి ద్విచక్రవాహనాలు నడుపుతుండగా మామడ మండలం కమల్‌కోట్ శివారులో పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. బుధవారం వారిని నిర్మల్‌లోని కోర్టులో హాజరుపరచగా పాతర్ల గంగన్నకు 14 రోజులు, పాతర్ల ప్రశాంత్‌కు 7 రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

బాసర, సెప్టెంబరు 25 : బాసర మండలం బిదరెల్లి గ్రామంలోని పెట్రోల్ బంక్ వద్ద బుధవారం ఉదయం 4 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. తానూర్ మండలానికి చెందిన పలువురు తిరుపతిలోని వెంకన్న దర్శనానికి బయలు దేరారు. ఆటోలో బాసర వరకు వెళ్లి అక్కడి నుంచి రైలు మార్గం ద్వారా వెళ్ళాల్సి ఉంది. ఆటోలో పయనిస్తున్నప్పుడు మార్గమధ్యంలో ఉదయం 4గంటల ప్రాంతంలో బిదరెల్లి పెట్రోల్ బంక్ వద్ద ఆటోను టిప్పర్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న పోలీసు సిబ్బంది స్పందించి క్షతగాత్రులను దవాఖానకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

తాంసి, సెప్టెంబర్ 25: తాంసిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని బుధవారం ఎంపీడీవో గడ్డం మోహన్ రెడ్డి పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట ఎంఈవో శ్రీకాంత్, మండల పంచాయతీ అధికారి లింగయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.